నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం మార్చి 04, 2025 www.navatelangana.com

'గ్రాడ్యుయేట్' ఫలితం ఆలస్యమే!

- నేటి అర్ధరాత్రి వరకు తేలనున్న ఫలితాలు
- ఇంకా కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల కౌంటింగ్
- సోమవారం అర్ధరాత్రి వరకు సుమారు లక్ష ఓట్ల ప్రాథమిక లెక్కింపు
- పట్టభద్రుల ఎమ్మెల్సీలో భారీగా చెల్లని ఓట్ల గుర్తింపు
- ముగ్గురు అభ్యర్థుల నడుమే మొదటిప్రాధాన్యత ఓట్ల సందడి
- మల్క కొమురయ్య విజయంతో బీజేపీ ఖాతాలో టీచర్ ఎమ్మెల్సీ
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో చెల్లని ఓట్లు 897




నవతెలంగాణ-నిజామాబాద్

ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం ప్రారంభంకాగా.. రాత్రి 10 గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించినట్టు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఇక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు పర్వం ఇంకా కొనసాగుతోంది. నేడు (మంగళవారం) అర్ధరాత్రివరకూ తుది ఫలితాలు వెలువడే అవకాశం ఉన్నట్టుగా అధి కారులు చెబుతు న్నారు.అయితే మొదటిప్రాధాన్యత ఓట్లన్నీ ముగ్గురు ప్రధాన అభ్యర్థుల నడుమే సందడి చేస్తుండగా.. నేడు తెల్లవారుజాము వరకు ముందంజలో ఎవరు ఉన్నారనే విషయం తెలిసిపోనుంది.

పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో ఓట్లను లెక్కించేందుకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ లో టేబుళ్ల ఏర్పాటు చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లకు సంబంధించి 499 బ్యాలెట్ బ్యాక్సులకుగాను 21 టేబుళ ఏర్పాటు చేసి ఓట్లు లెక్కిస్తున్నారు. మొత్తం 3,55,159 ఓటర్లకు గాను 2,50,106ఓట్లు పోలయ్యాయి. ఇందులో రాత్రి 10 గంటల వరకు పరిశీలిస్తే లక్ష ఓట్లు మాత్రమే ప్రాథమికంగా లెక్కించారు. ఇందులో 8వేల వరకు చెల్లనివిగా గుర్తించారు. మరో లక్షా 50వేల వరకు ఓట్లు లెక్కించాల్సి ఉంది. అయితే ప్రాథమిక లెక్కలో భాగంగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి తొలుత కొంత ముందంజలో ఉన్నట్టు తెలుస్తోంది. తరువాతి స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వస్తున్నట్టుగా సమాచారం. ఏదేమైనా మిగిలిన 1.50లక్షల ఓట్ల ప్రాథమిక లెక్క అనంతరం పూర్తిగా చెల్లనివి తొలగించాకే పూర్తిస్థాయి లెక్కించే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నేడు (మంగళవారం) అర్ధరాత్రివరకు తేలే అవకాశం ఉన్నట్టు సమాచారం.

టీచర్ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య విజయం


ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 15 మంది అభ్యర్థులు ఉండగా.. అందులో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించారు. మొత్తం 274 బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్ల పత్రాలను 14 టేబుళ్లలో లెక్కించారు. మొదటి నుంచి ప్రతి రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి కొమురయ్య ముందంజ కనబరిచారు. ఈ ఎన్నికల్లో 27,088 మంది ఓటర్లకుగాను 25041 మంది ఓటు హక్కు వినియోగించుకోగా ఇందులో 897 ఓట్లు చెల్లనివి గా ఎన్నికల అధికారులు గుర్తిం చారు. మిగిలిన 24144 ఓట్లలో గెలుపు కోటా 12,079 ఓట్లకు గాను మొదటి ప్రాధాన్యతలోనే బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు 12959 ఓట్లు పోలయ్యాయి. తరువాతి స్థానంలో పీఆర్‌టీయూ నుంచి పోటీచేసిన వంగ మహేం దర్‌రెడ్డికి 7182, టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్, ఎస్సీఎస్టీయూ ఎస్ మద్దతుతో పోటీ చేసిన అశోక్‌కుమార్‌కు 2621ఓట్లు పోలయ్యాయి.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

అభ్యర్థి పేరు	పోలైన ఓట్లు
మల్క కొమురయ్య	12959
వంగ మహేందర్‌రెడ్డి	7182
వై.అశోక్‌కుమార్	2621
కూర రఘోత్తమ్‌రెడ్డి	428
తిరులమలరెడ్డి ఇన్నారెడ్డి	320
యాటకారి సాయన్న	239
మామిడి సుధాకర్‌రెడ్డి	153
చెల్లని ఓట్లు	897
ఎల్.సుహాసిని	78
గవ్వల లక్ష్మి	41
ఎం. నర్సింహస్వామి	31
కంటే సాయన్న	12
జగ్గు మల్లారెడ్డి	10
సిలివేరు శ్రీకాంత్	7
చలిక చంద్రశేఖర్	6
వేముల విక్రమ్‌రెడ్డి	3
చెల్లిన ఓట్లు	24144
చెల్లని ఓట్లు	897
మొత్తం ఓట్లు	25041

పరీక్షలకు వేళాయే

- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారం యంత్రాంగం
- 36,222 మంది విద్యార్థులు, 57 సెంటర్‌లు..
- ఒత్తిడికి గురికావద్దు : జిల్లా ఇంటర్ విద్య అధికారి


ఫైల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. రేపు (బుధవారం) నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. నిజామాబాద్ జిల్లాలో 57 పరీక్ష కేంద్రాలలో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయగా.. ప్రతి సెంటర్లో సీసీ కెమెరాల నిఘాతో పాటు పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా అన్ని చర్యలను చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు.

మార్చ్ 5వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు జిల్లాలో మొత్తం 36,222 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరి కోసం మొత్తం 57 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు అన్ని ఏర్పాట్లలో నిమగ్నమైయ్యారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్ లలో మూడు సెట్ల ప్రశ్నాపత్రాలను కస్టోడియన్‌ల ఆధ్వర్యంలో నిక్షిప్తం చేశారు.

	మొదటి	ద్వితీయ
జనరల్	15053	13944
ఒకేషనల్	2736	2042
సప్లమెంటరీ	-	2447
మొత్తం	17,789	18,433

సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు

పరీక్షల నిర్వహణకు జిల్లాలోని 57 పరీక్ష కేంద్రాలను ఎప్పటికప్పుడు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ గా తాను, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 8 మంది సిటింగ్ స్కాడ్ లు, ఒక హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు ముగ్గురు తనిఖీలు చేస్తూ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు కృషి చేయనున్నట్టు డీఐఈవో తెలిపారు. విద్యార్థులు ఎలాంటి చీటీలు తీసుకొచ్చినా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు అవుతాయని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాగా చదువుకొని పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ఉదయం 8 గంటల వరకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

పుకార్లను నమ్మవద్దు

ఇంటర్ పరీక్షల నిర్వహణలో పటిష్టమైన బందోబస్తు తో పాటు ప్రతి క్షణం నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులు విధి నిర్వహణలో ఉన్నారని, బయట ఎలాంటి పుకార్లు వచ్చినా నమ్మరాదని జిల్లా ఇంటర్ విద్య అధికారి స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసే ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లో క్షమించే ప్రసక్తే లేదని తెలిపారు.

ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దు

జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్



మార్చి 5వ తేదీ ప్రారంభమవుతున్న ఇంటర్ పరీక్షలకు హాజరు కాబోతున్న విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురి కావొద్దు. విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షలకు హాజరుకావాలి. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. ప్రైవేటు కళాశాలల వారు ఎవరైనా హాల్ టికెట్లను ఇవ్వనట్లయితే నేరుగా ఇంటర్నెట్ లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావచ్చు. హాల్ టికెట్ పైన ప్రిన్సిపాల్ సంతకం గాని, కళాశాల ముద్ర గాని ఉండాల్సిన అవసరం లేదు. కాబట్టి విద్యార్థులు ఎవరు టెన్షన్ పడొద్దు.

రేపు జాబ్‌మేళా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 5న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి బి.పి మధుసూదన్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు మెడ్ ప్లస్ కంపెనీలో ఫార్మసిస్ట్, జూనియర్ అసిస్టెంట్, ఆడిటర్, సిఎస్ఏల ఉద్యోగాలు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, బి.ఫార్మసి, యం.ఫార్మసీ, ఏదైనా డీగ్రీ పాసైనా వారు అర్హులని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలు నిజమాబాద్ జిల్లా వ్యాప్తంగా కలవని, ఆసక్తి గల అభ్యర్థులు నిజామాబాద్‌లోని శివాజీనగర్‌లో గల ఉపాధి కార్యాలయం(ఐటీఐ)లో 5న ఉద్యోగ మేళ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం లోపు అభ్యర్థులు బయో డేటా, ఆధార్‌కార్డు, మెమోలు, ఫోటోలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9948748428, 6305743423, 7702259070 నెంబర్‌లను సంప్రదించాలని తెలిపారు.

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్


బీఆర్ఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్పు గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలు, మోసాలపై బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రతి హామీని అమలు చేసే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. మహిళలను, రైతులను, కూలీలను, కార్మికులను అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ కి ఉంది అన్నారు.

మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ ది అని, కేసీఆర్ 10 సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిన ఘనత కేసీఆర్‌ది అని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై కెసిఆర్ కేటీఆర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేసి మరోసారి కెసిఆర్ ని ముఖ్యమంత్రిని చేసే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బి ఆర్ ఎస్ అధ్యక్షులు జూకంటి ప్రభాకర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు పిప్పిరి ఆంజనేయులు, మాజీ ఎంపీపీ పసుల బాలమణి, గంద్ర మధుసూదన్ రావు పార్టీ అధికార ప్రతినిధులు ఉత్తునూరు బలవంతరావు, గైని శ్రీనివాస్ గౌడ్, భాను ప్రసాద్, బాలచంద్రం, కృష్ణమూర్తి, నీరడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణికి 62 ఫిర్యాదులు.. స్వీకరించిన కలెక్టర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ
- 6న కలెక్టరేట్, 7న హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాలు జయప్రదం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న ఎస్ రమ

నవతెలంగాణ-కంఠేశ్వర్

'రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్లలో కనీస వేతనాల డ్రాఫ్ట్ జీఓలను విడుదల చేసింది. వేతనాల నిర్ణయం అశాస్త్రీయంగా చేశారు. పాత విడిఏను ప్రస్తుతం పొందుతున్న వేతనంలో కలిపారే తప్ప కొత్త డ్రాఫ్ట్ జీఓలలో నయా పైసా పెంచలేదు. ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ జీఓలను సవరించాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని' సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. కనీస వేతనం అమలు కోసం మార్చి 1 నుంచి 7 వరకు క్యాంపెయిన్ జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్ని పారిశ్రామిక ప్రాంతాలు, పని ప్రదేశాలలో సభలు, సమావేశాలు జరపాలని, కార్మిక శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని 2025 మార్చి 6న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా చేసి వినతి పత్రాలు ఇవ్వాలని, మార్చి 7న హైదరాబాద్ లేబర్ కమీషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. కార్మికులు కనీస వేతనాలు పోరాడి సాధించుకోవాలి. గత 10 స.లుగా సిఐటియు నిరంతరం కనీస వేతనాల జీఓల సవరణ కోసం సమరశీల పోరాటం చేస్తున్నది. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు సవరించాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తున్నట్టు గుర్తుచేశారు. 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే క్యాంపెయిన్లో పరిశ్రమల కార్మికులతో పాటు పవర్ లూమ్, బీడీ, బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్, ట్రాన్స్పోర్ట్, సెక్యూరిటీ గార్డ్స్ తదితర షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు కిషన్, తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

కూలర్‌కు పెరిగిన గిరాకీ

- సరికొత్త మోడల్స్‌లలో ప్రజలకు అందుబాటులోకి
- ఫ్రిడ్జ్, కుండల కొనుగోలుకు ఆసక్తి



విక్రయానికి సిద్ధంగా ఉన్న కూలర్‌లు


నవతెలంగాణ-బాల్కొండ

ఈసారి వేసవి కాలం కంటే ముందే ఎండలు ముదిరాయి. సామాన్యంగా ఏప్రిల్ నుంచి ఎండ తీవ్రత పెరగాల్సి ఉండగా.. అంతకముందే ఫిబ్రవరి చివరి వారం నుంచి పెరుగుతూ వస్తుంది. మార్చి మొదటి వారంలోనే 38 డిగ్రీల తీవ్రత ఉండటంతో ప్రజలు ఉక్కపోతతో సతమతమవుతున్నారు. ఉక్కపోత నుంచి రక్షణకు కూలర్‌లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో కూలర్‌లకు గిరాకీ పెరిగింది. వివిధ మాడళ్లల్లో పలువురు వ్యాపారులు కూలర్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటితో చల్లటి నీటి కోసం కుండలు, ఫ్రిడ్జ్‌తో పాటు ఏసీలను కొనుగోలు చేస్తున్నారు.

వేసవికాలం రాగానే మనందరికీ గుర్తొచ్చేవి ఫ్రిడ్జ్‌లు, కూలర్లు... ఎండ నుంచి రక్షణకు, వేసవి తాపానికి ప్రతి ఇంట్లో ఇవి దర్శనమిస్తుంటాయి. వేసవికాలం వస్తున్న సందర్భంలో మండలంలో ఫ్రిడ్జ్ కూలర్ ల విక్రయాలు జోరందుకున్నాయి. ఎండాకాలం దృష్ట్యా ఉక్కపోత నుంచి రక్షణ పొందేందుకు ఇప్పటినుంచి ప్రజలు వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మండలంలోని పలు ఎలక్ట్రానిక్ దుకాణాలలో ఇప్పటికే వ్యాపారస్తులు సరికొత్త మోడల్లలో కూలర్లను ఫ్రిడ్జ్‌ను అందుబాటులో ఉంచారు. మధ్య తరగతి వారికి సైతం ధరలు అందుబాటులో ఉండే విధంగా వ్యాపారస్తులు వివిధ వెరైటీలలో విక్రయానికి సిద్ధమ య్యారు. వీటి ధర మోడల్ ని బట్టి రూ 2 వేల నుంచి 25 వేల వరకు ఉన్నట్లు సమాచారం. ఎండాకాలంలో వీటి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో అధిక మొత్తంలో స్టాక్ అందుబాటులో ఉంచారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే కస్టమర్ల కోసం డోర్ డెలివరీ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచినట్టు వారు తెలిపారు.

క్రమంగా పెరుగుతున్న గిరాకీ

జి.నిఖిల్ సీఈవో. శ్రీ హరిహర ఎలక్ట్రానిక్స్, ఎంటర్ప్రైజెస్. బాల్కొండ



ఈసారి ఎండలు ముందుగానే ముదిరాయి. దీంతో కూలర్‌లకు గిరాకీ పెరుగుతుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ మోడళ్లలో కూలర్‌లను అందుబాటులోకి తీసుకొచ్చాం. గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం నాణ్యత ప్రమాణలతో కూడిన కూలర్లు, ఫ్రిడ్జ్ లను వివిధ మోడల్స్ లలో అందుబాటులో ఉంచాం. వీటిని సరసమైన ధరలకే, కంపెనీ వారంటీతో సహా వినియోగదారులకు విక్రయిస్తాం. గ్రామీణ ప్రాంతాల వారి కోసం డోర్ డెలివరీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంచాం.

అడుక్కుతిని బతుకుతున్నా..

- కొడుకులు, కోడళ్లు ఎవరూ పట్టించుకోవడం లేదు
- ఓ వృద్ధురాలి ఆవేదన
- ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు.. అడ్డుకున్న బంధువులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



'నాకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అడుక్కుతిని బతుకుతున్నా.'నంటూ ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. వారిపై ఫిర్యాదు చేసేందుకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు నిజామాబాద్ కలెక్టరేట్‌కు వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న వృద్ధురాలి బంధువులు కలెక్టరేట్‌కు వెళ్లనీయకుండా అడ్డుకుని సముదాయించి అక్కడినుంచి నిర్మల్‌కు తీసుకెళ్లారు.

వివరాలు మెయిన్‌లో..

ఏసీబీకి చిక్కిన సబ్‌రిజిస్ట్రార్

- పదివేల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్


పట్టుబడ్డ సబ్‌రిజిస్ట్రార్ రామరాజు, స్వీపర్

ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం రూ.10 వేల లంచం తీసుకుంటూ నిజామాబాద్ సబ్‌రిజిస్ట్రార్-2 రామారాజు ఏసీబీకి చిక్కారు. జిల్లా కేంద్రంలోని కవిత కాంప్లెక్స్‌లో గల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుని పేరు మీద ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసినందుకు సబ్ రిజిస్ట్రార్-2 రూ.10 వేల లంచండి డిమాండ్ చేశాడు. ఆ డబ్బులను కార్యాలయ స్వీపర్ రంగసింగ్ వెంకట్‌రావుకు అందజేయాలని ఆదేశించాడు. దీంతో ఫిర్యాదిదారు రూ.10 వేల నుంచి స్వీపర్‌కు అందజేయగా.. ఆయన నుంచి సబ్‌రిజిస్ట్రార్-2 డబ్బులను తీసుకున్నాడు. రసాయన పరీక్షలో సబ్‌రిజిస్ట్రార్-2 రెండు చేతులపై, షర్ట్ ఎడమ చేతి జేబులోపలి ఫ్లాప్‌పై సానుకూల ఫలితం వచ్చినట్టు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంచినట్లు తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్-2తో పాటు స్వీపర్‌ను అరెస్టు చేసి హైదరాబాద్‌లోని నాంపల్లిలోని స్పెషల్ అండ్ ఏసిబి కేసుల కోసం అదనపు ప్రత్యేక న్యాయమూర్తి కోర్టు ముందు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టనున్నట్టు తెలిపారు.

కాగా నిజామాబాద్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్‌లకు, డాక్యుమెంట్ రైటర్‌లకు గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్‌లు సకాలంలో చేయడం లేదని, డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులకు సబ్‌రిజిస్ట్రార్-2 రామరాజు రూ.10 వేల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం చర్చనీయాంశమైంది.

పసుపు సాగుకు రైతులను ఏ విధంగా సిద్ధం చేస్తున్నారు..?

- పసుపు పరిశోధన స్థానాన్ని సందర్శించిన పసుపు బోర్డు చైర్మన్, కార్యదర్శి


పసుపు వంగడాలు పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ పసుపు పరిశోధన స్థానాన్ని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బోర్డు కార్యదర్శి భవాని శ్రీ సోమవారం సందర్శించారు. పసుపు పరిశోధనా స్థానంలో జరిగే పరిశోధనల గురించి, పసుపు రైతులను సాగుకు ఏ విధంగా సిద్ధం చేస్తున్నారు? అందుకు అమలు చేస్తున్న ప్రణాళికలు ఏమిటని పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్, శాస్త్రవేత్త భాస్కర్ ను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రంలో నూతన వంగడాల కోసం జరిగే పరిశోధనల గురించి బోర్డు చైర్మన్ కు, కార్యదర్శికి శాస్త్రవేత్తలు వివరించారు. అదేవిధంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశోధన స్థానంలో జరుగు పరిశోధనల గురించి తెలియజేశారు. పసుపు విత్తనాల అందుబాటు ధర స్థిరీకరణ, పసుపు ఎగుమతులు, మేకనైజేషన్, తదితర అంశాల గురించి శాస్త్రవేత్తలతో చర్చించారు. అనంతరం పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన నూతన పసుపు వంగడాలను వారు పరిశీలించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
2
మంగళవారం | మార్చి 04, 2025 | www.navatelangana.com

శిథిలావస్థలో జీపీ కార్యాలయం



నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని కొప్పర్తి క్యాంప్ గ్రామంలో గల గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. పంచాయతీ కార్యాలయ భవనం గోడలు బీటలువారి చీలిపోయింది. దానిని నామమాత్రంగా సిమెంట్ పూతపూసి మరమ్మతులు చేశారు. ప్రస్తుతం ఇందులోనే పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. మహిళ సంఘం సమావేశాలు సైతం ఇదే భవనంలో నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి స్పందించి నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న గంధపు రాజు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో ఎస్సీ కాలనీకి చెందిన సోనాయి మాదయ్య ఆకస్మాత్తుగా మరణించడంతో వారి కుటంబ సభ్యులందరూ దు:ఖంలో మునిగిపోయారు. నిరుపేద అయిన ఆ కుటుంబానికి గంధపు రాజు వారిని పరామర్శించి ఆర్థికసాయాన్ని చేశారు. ఆ సమయంలో మన్సూర్, యజ్దాన్ దేశాయి, హైమద్, భూమయ్య, పోశెట్టి, సంజీవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌పురం గ్రామంలో చర్చిటవర్ నిర్మాణాన్ని ఆపాలి


ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలో ఎస్ఎన్‌పురం గ్రామ పంచాయతీ పరిధిలో రామాలయం వెనుక కోటయ్య క్యాంప్‌నకు వెళ్లే దారిలో సిఎస్ఐ చర్చి యాజమాన్యం పాస్టర్ దేవా సహాయం 50 అడుగుల ఎత్తులో ఒక టవర్ నిర్మాణం చేస్తున్నారని, ఈ నిర్మాణం కట్టడం విషయంలో హైకోర్ట్ ద్వారా స్టే ఆర్డర్ నిర్మాణం ఆపాలని ఆదేశించినా.. మళ్లీ నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారని దేవాలయ పరిరక్షణ సమితి పటేల్ ప్రసాద్, హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పిట్ల స్వామి, పార్వతి, మురళి, బోత్ కిషన్, భాస్కర్, సుబ్రహ్మణ్యం, స్వామి ప్రతాప్ తదితరులున్నారు.

నిజామాబాద్ జిల్లా ఎస్ఈని కలిసిన పలువురు


ఎస్ఈని కలిసిన పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మార్చి 20న టీవీఏసీ జెఏసీ తలపెట్టిన చలో విద్యుత్ సౌధా కార్యక్రమానికి వచ్చిన కార్మికులకు 20వ తేదీ నుంచి 28 వరకు తొమ్మిది రోజుల వేతనాన్ని సుమారు రూ.13000 కట్ చేశారని నిజామాబాద్ జిల్లా శాఖ ఎస్ఈతో టీవీఏసి జేఏసీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సింగిరెడ్డి చంద్రరెడ్డి సోమవారం విన్నవించారు. ఎస్ఈ స్పందించి వెంటనే ఎన్‌ఓసి అప్లై చేయాలని డిఈలతో మాట్లాడి విరి వేతనాలను సవరించి వెంటనే ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కనకరాజు, కరుణాకర్, టీవీఏసి జెఏసి నిజామాబాద్ జిల్లా కన్వీనర్ బట్టు గంగాధర్, వర్కింగ్ చైర్మన్ నరేష్, వైస్ చైర్మన్ తామస్, నిజామాబాద్ డివిజన్ చైర్మన్ రతన్ సింగ్, డిచ్‌పల్లి డివిజన్ చైర్మన్ రవీందర్, రాజేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం


ఇంటి నిర్మాణానికి ముగ్గుపోస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా పేపర్‌మిల్లు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించినట్టు ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మండలానికి ఒక పైలట్ గ్రామంగా ఎంపిక చేయగా.. ఇండ్లులేని నిరుపేదలను గుర్తించినట్టు తెలిపారు. ఈ గ్రామంలో సుమారు 124 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే ఈ ఇండ్ల నిర్మాణానికి గ్రామానికి చెందిన షబానా బేగం ఇంటిని ముగ్గు వేసి నిర్మాణ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు సిహెచ్ సాయిలు, జక్కు భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్‌లో బ్రాహ్మణపల్లి ఉపాధ్యాయురాలు


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఫిబ్రవరి నెలలో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో జరిగిన జాతీయస్థాయి ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ హాకీ టోర్నీలో తెలంగాణ రాష్ట్రం నుంచి జక్రాన్‌పల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బ్రాహ్మణపల్లికి చెందిన హిందీ ఉపాధ్యాయురాలు పి.రాణి పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల మాట్లాడుతూ.. తమ పాఠశాల నుంచి ఉపాధ్యాయురాలు జాతీయస్థాయి హాకీ టోర్నీలో పాల్గొనడం తమ పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయిలో మరింత రాణించి, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకావాలని ఆమెను ప్రోత్సహించారు. హాకీ క్రీడలో తనతో పాటుగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దుతున్నందుకు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు జగదీశ్వర్, అరుంధతిరాణి, గంగాధర్, రాము, గంగాప్రసాద్, స్వరూప రాణి, గంగామణి, గులాబ్ ఖాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా యూజీసీ గైడ్ లైన్స్


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

- వర్సిటీల స్వయంప్రతిపత్తిని నిర్వీర్యం చేసే కుట్రలు
- రాష్ట్రాల హక్కులను కాల రాసే నిర్ణయాలు
- ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు రఘురాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా యూజీసీ గైడ్ లైన్స్ ఉందని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేసే కుట్రలున్నాయని, రాష్ట్రాల హక్కులను కాల రాసే నిర్ణయాలు తీసుకోవడం హేయమని, యూజీసీ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు రఘురాం డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ యూనివర్సిటీలో ఏఐఎస్ఎఫ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చట్టబద్ధమైన స్వతంత్ర సంస్థ అని, కేంద్రం తన సొంత ఎజెండాను వర్సిటీలలో అమలుపరిచేందుకు కుట్రలు చేస్తుందని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ తీసుకువచ్చిన యూజీసీ నూతన మార్గదర్శకాలు రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు రఘురాం డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను దెబ్బతీసే విధంగా పాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దానిలో భాగమే విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తూ జాతీయ విద్యా విధానం పేరుతో విద్య కాషాయికరణకు పూనుకున్నారని ఆరోపించారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ఆచార్యుల నియామకాలు, పదోన్నతి కోసం కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణ పేరిట యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జనవరి 6న ముసాయిదా డ్రాఫ్ట్‌ను విడుదల చేసిందని, విద్యలో కేంద్ర, రాష్ట్రాల అధికారాల విషయంలో రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నప్పటికీ దాని స్ఫూర్తికి విరు ద్ధంగా ఈ ముసా యిదా ప్రతిపా దనలు ఉంటూ రాష్ట్రాల హ క్కులను, నిర్ణ యాధికారాన్ని బలహీన పరుస్తూ మొత్తంగా ఫెడరల్ స్ఫూర్తిని ఉల్లంఘి స్తూ రాజ్యాంగ మూల సూత్రాలకు వ్యతిరేకంగా ఉందని మం డిపడ్డారు. పూర్తిగా గవర్నర్ చేతిలో వీసీల నియా మకాలు రాజ్యాంగ విరు ద్ధమని అన్నారు. ఇప్పటి వరకూ వైస్ ఛాన్సలర్ (వీసీ)ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ వేస్తూ వస్తోందని, ఈ కమిటీలో ముగ్గురు సభ్యులు యూజీసీ ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదించిన సభ్యుడు, యూనివర్సిటీ కౌన్సిల్ ప్రతినిధి ఉంటున్నారని, ఈ సెర్చ్ కమిటీ సీనియారిటీ, అర్హతలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ముగ్గురు పేర్లను సూచిస్తుందని తెలిపారు. ఆ ముగ్గురు పేర్లను రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపుతుందని, ఆ ముగ్గురిలో ఒకరిని గవర్నర్ వీసీగా ఎంపిక చేస్తారని.. కానీ ఇప్పుడు యూజిసి 2025 సవరించిన నియమాలు వైస్ ఛాన్సలర్ల ఎంపికలో రాష్ట్ర గవర్నర్లకు ఎక్కువ అధికారాన్ని ఇస్తున్నాయని, ఇది అత్యంత ప్రమాదకరమని తెలిపారు. ఈ యూజీసీ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర యూనివర్సిటీలు రాష్ట్ర అసెంబ్లీ చట్టం ద్వారా ఏర్పాటు చేయబడతాయని రాష్ట్ర ప్రభుత్వమే యూనివర్సిటీలకు నిధులు కేటాయిస్తుందని, కానీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లను నియమించి ఆర్ఎస్ఎస్ భావజాలానికి చెందిన వారిని ప్రొఫెసర్లుగా రిపోర్టు చేయడానికి కుట్రలు చేస్తున్నారని, దీనిని రాష్ట్ర ప్రభుత్వాలు గమనించి వ్యతిరేకించాలని వారు అన్నారు. యూజీసీ ముసాయిదా ప్రతిపాదనలు ఉన్నత విద్యలో పూర్తిస్థాయి కార్పొరేట్ సంస్కృతిని చొప్పిస్తుందని అలాగే ఉపాధ్యాయులకు నిర్దిష్ట బోధన సమయం ప్రస్తావించలేదని, 'నెట్' అవసరం లేకుండా 'మాస్టర్స్ డిగ్రీ' ఉంటే చాలు అంటూ 55 శాతం మార్కులతో మాస్టర్స్ సాధించిన వారిని యూజీసీ నెట్‌లో అర్హత సాధించకపోయినా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నేరుగా నియమించుకోవచ్చని పేర్కొనడం బాధాకరమని అన్నారు. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రం ఒక్కొక్కటిగా తన ఆధీనంలోకి తీసుకుంటూ రాష్ట్రాలపై తన విధానాలను బలవంతంగా రుద్దుతోందని దుయ్యబట్టారు. ఇప్పటికే తమిళనాడు, కేరళ వంటి అనేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలో ప్రభుత్వాలు గవర్నర్‌లతో వీసీల నియామకంపై వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నాయని, ఆ రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకొని కేంద్రంపై, యూజీసీ వత్తిడి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ యూనివర్సిటీ కన్వీనర్ సాయి, కో కన్వీనర్లు సంజయ్, చందు, విజయ్, దినేష్ పాల్గొన్నారు.

సూచికల్లేని చౌరస్తా

- గందరగోళానికి గురవుతున్న వాహనదారులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని భండార్‌పల్లి సమీపంలోని రాజన్న చౌరస్తా ఎలాంటి సూచికల్లేని చౌరస్తాగా వాహనదారులకు అయోమయానికి గురిచేస్తోంది. జాడిజమాల్‌పూర్, బోధన్, రాంపూర్, చిన్నమావంది, కొప్పర్గ ఇలా నాలుగు గ్రామాలకు వెళ్లే రహదారులు కలిసిన ప్రదేశం కావడంతో ఏ రోడ్డు ఎటువైపు వెళ్తుందో తెలియక వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు ఒక గ్రామానికి బదులు మరో గ్రామానికి వెళ్లిన సందర్భాలున్నాయని పలువురు అంటున్నారు. కావున అధికారులు తక్షణమే ఆయా గ్రామాలకు వెళ్లేలా తెలిపే సూచిక బోర్డులను ఏర్పాటుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.


గ్రామాలను సూచించే సూచికలు లేని రాజన్న చౌరస్తా

అక్షరయాన్ బాలిక పురస్కారం అందుకున్న తడపాకల్ విద్యార్థిని



నవతెలంగాణ-ఏర్గట్ల

తడపాకల్ గ్రామానికి చెందిన విద్యార్థి ఇప్ప సౌమ్య హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఐనంపూడి లక్ష్మీ చేతుల మీదుగా 2024-2025 సంవత్సరానికి గానూ అక్షరయాన్ బాలిక పురస్కారాన్ని అందుకున్నట్లు ఏర్గట్ల తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. సాహిత్య పరంగా అనేక కథలు, కవితలు రాసినందుకు సౌమ్యకు ఈ గౌరవం దక్కినట్లు తెలిపారు.

తాగునీటి కోసం బోరు మోటార్ ఏర్పాటు

- నిరంతరం నీటి సరఫరా చేయిస్తాం
- ఎంపిఓ రాజ్ కాంత్‌రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపిఓ రాజ్ కాంత్ రావు పేర్కొన్నారు. గత పదిహేను రోజులుగా తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని ఇందల్‌వాయి మండలంలోని మేగ్యానాయక్ తండా వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు సోమవారం తండాకు మిషన్ భగీరథ డీఈతో కలిసి పరిశీలించి అప్పటికప్పుడే మోటార్‌ను బిగించారు. తండాలో ఇతర చోట్ల ఉన్న బోర్ మోటార్‌లను పరిశీలించి మరమ్మతులు చేసి తాగునీరు అందజేస్తామని చెప్పారు.

జాతీయస్థాయి అబాకస్‌లో సత్తా చాటిన కాంతి హైస్కూల్ విద్యార్థులు



గెలుపొందిన విద్యార్థికి బహుమతి అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

హైదరాబాద్‌లో విశ్వం ఎడ్యుటెక్ వారి ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్ పోటీలలో పట్టణంలోని పెర్కిట్ కాంతి హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు రుద్రాన్ష్, స్వజిత్ సత్తా చాటారు. రుద్రాన్ష్ వేదిక్ మ్యాథ్‌లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకొని ఛాంపియన్‌గా నిలవగా, స్వజిత్ రెండవ స్థానాన్ని కైవసం చేసుకుని బెస్ట్ పెర్ఫార్మర్‌గా నిలిచాడు. రుద్రాన్ష్ 5000 క్యాష్ ప్రైజ్ గెలుచుకోగా, స్వజిత్ 2000 క్యాష్ ప్రైజ్ గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా కాంతి హైస్కూల్ ఫౌండర్ కాంతి గంగారెడ్డి సోమవారం మాట్లాడుతూ జాతీయస్థాయిలో వివిధ పాఠశాలలు పాల్గొన్న పోటీలలో కాంతి విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో అవార్డులు పొందడం వారికెంతో సంతోషకరమని అన్నారు. ఇంతకు ముందు కూడా జిల్లా, రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు ఎన్నో అవార్డులను గెలుచుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ట్రైనర్ విశాలిని అభినందించారు. విద్యార్థులు ఇటువంటి కీర్తి శిఖరాలను ఎన్నో అధిరోహించాలని వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర సబ్-జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో తొర్లికొండ విద్యార్థులకు పతకాలు


విద్యార్థులను అభినందిస్తున్న విద్యాధికారి, పాఠశాల సిబ్బంది

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు సిద్దిపేట్ జిల్లా గజ్వేల్‌లో జరిగిన 5వ రాష్ట్ర సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థులు బాలికల విభాగంలో జి.సరిత, ఆర్.గంగోత్రి, బి.మైత్రి, జి.వనజ పాల్గొని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి బంగారు పతకాలు సాధించారు. బాలుర విభాగంలో బి.విష్ణు చైతన్య, డి.మురళి, సిహెచ్ సుశాంత్ జట్టు తృతీయ స్థానంలో కీలకపాత్ర పోషించి కాంస్య పతకాలు అందుకున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు.

మినీ-జూనియర్ ఎంపికలో కే కిషోర్, ఎం.సిద్ధార్థ పాల్గొని రాష్ట్ర ప్రబబుల్స్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పతకాలు సాధించి, జాతీయ జట్టుకి ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జక్రాన్‌పల్లి మండల విద్యాధికారి ఎం.శ్రీనివాస్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు నాగేంద్ర, ఉపాధ్యక్షులు స్వామి, గ్రామ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, గంగాధర్, డాక్టర్ నరసింహారావు, సునీత, కృష్ణ, మాలతి, పల్లె గంగాధర్, గౌతమి, ఓఎస్ శేఖర్ అభినందించారు.

ద్వితీయ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సిద్దిరాములు పిలుపు



మాట్లాడుతున్న బిఎల్‌టీయూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏప్రిల్ 29, 30న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ ద్వితీయ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సిద్దిరాములు పిలుపునిచ్చారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సిద్దిరాములు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు సిద్దిరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగారపు ఎల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆంజనేయులు మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట చారిత్రక నేపథ్యం కలిగిన తెలంగాణ నేలపై శ్రామిక బహుజన కార్మిక వర్గాన్ని ఐక్యపరచడం ద్వారా కార్మికవర్గ భాగస్వామ్యంతో తెలంగాణలో బహుజనులకు రాజ్యాధికారం వస్తుందనే ఉద్దేశంతో భారత కార్మిక వర్గం నిర్మాత, నారాయణ మేఘజీ, పూలే, అంబేద్కర్, మార్క్స్ సిద్ధాంత నినాదంతో ఆవిర్భవించిన ఏకైక కార్మిక సంఘం తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం అని తెలిపారు.

భూమి క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ రుసుం 25 శాతం తగ్గింపు

- మున్సిపల్ కమిషనర్ రాజు



నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన భూమి క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) రుసుం 25శాతం తగ్గింపు రాయితీ 31 మార్చి వరకు ఉన్నట్టు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. 2020 సంవత్సరంలో 1000 రూపాయలు చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాటు యజమానులు 31 మార్చి 2025లోగా పూర్తి ఫీజు చెల్లించి 25శాతం రాయితీ పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకుని ప్రజలు తమ ప్లాటును క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. భవిష్యత్‌లో గృహ నిర్మాణం చేసుకోవడానికి అధిక రుసుము చెల్లించే అవకాశం ఉండదని తెలిపారు. అలాగే కొత్తగా ఇచ్చిన సూచనల ప్రకారం నిషేధిత భూములు కానివి, వాటర్ బాడీస్‌కి 200 మీటర్ల వెలుపల గల ప్లాట్లకు సంబంధించి కూడా దరఖాస్తుదారులకు ఫీజు ఇంటిమేషన్ లెటర్లు వెళ్లినట్టు పేర్కొన్నారు. వాళ్ళు కూడా 25శాతం రాయితీతో ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని, హెల్ప్ లైన్ నెంబర్ 8341881864ను సంప్రదించాలని సూచించారు.

షీటీం పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్సై

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు సోమవారం స్థానిక ఎస్సైషీ షీ టీంపై అవగాహన కల్పించారు. వాట్సాప్ ఫోన్లు వస్తే మాట్లాడొద్దని ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడితే 100 నెంబర్‌కు డయల్ చేయాలని నిమిషాల్లో షీ టీం వచ్చి ఆదుకుంటుందని సూచించారు. మహిళలు నిర్భయంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి ఓటీపీ చెప్పాలని అడుగుతుంటారని, గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి ఓటీపీలు కూడా చెప్పొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి సురేఖ, ఉపాధ్యాయ బందం విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ గేట్‌వాల్ మరమ్మతులు



నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయిలో తాగునీటి పైప్‌లైన్ గేట్ వాల్ చెడిపోవడంతో సోమవారం మరమ్మతులు చేపట్టారు. ముందస్తు వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఉండొద్దని ఉద్దేశంతో చెడిపోయిన 24 గంటల్లోపైప్ లైన్‌కు ఉన్న రెండుగేట్ వాల్స్‌కు మరమ్మతు పనులు చేయించినట్టు పంచాయతీ కార్యదర్శి బాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగారం, సిబ్బంది స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు తొలి ప్రాధాన్యత

- ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి/దోమకొండ/భిక్కనూర్/తాడ్వాయి/నిజాంసాగర్

ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భూముల సమస్యలు, రెండుపడక గదుల ఇళ్ల మంజూరు, రైతు భరోసా, మున్సిపల్ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు, మున్సిపల్ రోడ్ల ఆక్రమణ, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో (52) ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పెండింగులో ఉన్న అర్జీలపై చర్యలు చేపట్టి దరఖాస్తు దారునికి సమాచారం అందించాలని తెలిపారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదుల్ నిల్

దోమకొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యా లయంలో సోమవారం నిర్వహించిన ప్రజావా ణికి ఫిర్యాదులు అందలేవని తహసీల్దార్ సంజయ్ రావు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, మండల ప్రజలు రైతులు తమ సమస్యలను నేరుగా ప్రజావాణి లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏపీవో రజని, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు త్వరగా పరిష్కరించాలి

భిక్కనూర్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వర గా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాం గ్వాన్ తాసిల్దారులకు వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా భిక్కనూర్, రాజంపేట్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తహసీల్దారులు శివ ప్రసాద్, అనిల్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

తాడ్వాయి : ప్రజావాణి కార్యక్రమంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసిల్దార్ రహీముద్దీన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీ ఓ సవిత రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి నర్సింలు, విద్యాశాఖ అధికారి రామస్వామి, ఐసిడిఎస్, ఆరోగ్యశాఖ, ఏపీఎం మనోహర్, తదితర శాఖల అధికారులు హాజరైనట్లు తెలిపారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



నిజాంసాగర్ : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులూ రాలేదని మండల రెవెన్యూ అధికారి బిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నప్పటికీ ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని ఆయన అన్నారు. ప్రజా సమస్యలపై నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలందరూ కూడా వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఫిర్యాదు చేసిన సమస్యలపై తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్, మండల విద్యాశాఖ అధికారి తిరుపతిరెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి: అర్జీలను స్వీకరిస్తున్న కామారెడ్డి కలెక్టర్

అధికారుల హాజరు అంతంతే

- ప్రజావాణి పట్ల పలుశాఖల అధికారుల ఉదాసీనత

నవతెలంగాణ-మద్నూర్

అధికారంలో గల కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మకంగా ప్రజావాణి కార్య క్రమాన్ని చేపడుతూ వస్తుంది. మండలాల్లో, డివిజనల్, జిల్లా కేంద్రాల్లో రాష్ట్రంలో ప్రజావాణి కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ చూపుతుంది. కానీ మద్నూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాల యంలో తహసిల్దార్ అధ్యక్షతన నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి పలు శాఖ అధికారులు హాజరు కావడం లేదు. నామమాత్రంగా అధికారులు హాజరవుతున్నారు. ముఖ్యంగా ప్రజావాణి కార్యక్రమంలో తహసిల్దార్ ఎండి ముజీబ్ ఎంపీడీవో రాణి ఎంపీ ఓ వెంకట నరసయ్య అగ్రికల్చర్ ఏవో రాజు ఈ డిపార్ట్మెంట్ల అధికా రులు తప్ప మిగతా డిపార్ట్మెంట్ అధికారులు ప్రజావాణికి హాజరు కాకపోయినా వారికి అడిగే వారే లేరని మండల ప్రజల్లో ఆరోపణ లు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై అధికారులకు ఒక రిజిస్టర్ మెయింటెనెన్స్ చేస్తారు. వచ్చిన అధికారి ఆ రిజిస్టర్లో సంతకా లు చేయాలి. రానివారు గైర్హాజరుగా పరిగణిం చాలి. ఇలాంటి నిబంధనలు ఉన్నప్పటికీ అధికారుల గైర్హాజరు సమాచారం జిల్లా అధికారులకు నివేదికలు అందుతున్నాయా లేదా తెలియని పరిస్థితి నెలకొంది. ప్రజల సమస్యలు పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు హాజరైతేనే సమస్యలు సకాలంలో తీర్చేందుకు అవకాశం ఉంటుందని, ఇకముందైనా అధికారులు హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

సస్య రక్షణ పద్ధతులపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట్ గ్రామంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైతు క్షేత్ర పాఠశాలలో భాగంగా రైతులకు సమగ్ర సస్య రక్షణ కిట్లు (ఐపీఎం) అందజేశారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హెూన్నప్ప గౌడ పర్యవేక్షణలో గత ఆరు వారాల నుండి క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంట వేసినప్పటి నుండి పంట చేతికి వచ్చు వరకు పాటించవలసిన అన్ని సస్య రక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి , వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో మల్లన్న గుడి 3వ వార్షికోత్సవం



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొల్లపల్లిలో యాదవులు మల్లన్న గుడి 3వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చివరి రోజు సోమవారం స్వామివారి కల్యాణోత్స వాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేడు అగ్నిగుండాలు, అన్నదాన కార్యక్రమంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు యాదవ సంఘం తెలిపారు. కార్యక్రమంలో కిష్ట యాదవ్, మల్లేష్ యాదవ్, కిషన్ యాదవ్, మహేష్ యాదవ్, సంఘ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించరా..?

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రమైన తాడ్వాయిలో ఉపాధి పనులు ప్రారంభించరా అంటూ ఆందోళన చెందుతున్నారు. వలసల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ ప్రవేశపెట్టగా తాము గత సంవత్సరం 100 రోజుల కూలీ పనులు చేశామని ఈ ఏడు పనులు ప్రారంభించకపోవడంతో తాము కామారెడ్డి ఇతర ప్రాంతాలకు కూలి పనులకు వెళ్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఉపాధి హామీ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు .

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-గాంధారి

ఇంటర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌ను తహసీల్దార్ సతీష్ రెడ్డి, ఎస్ఐ ఆంజనేయులు సోమవారం పరిశీలించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఉన్నందున కాలేజ్ చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉన్నట్టు తెలిపారు. పరీక్షలు సాఫీగా జరిగేలా ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. వీరి వెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగారం, అధ్యాపకులు ఉన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థి



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్దరా మేశ్వరనగర్ గ్రామానికి చెందిన అకుల్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆర్చరీ అసో సియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-12 విభాగంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు కోచ్ ప్రతాప్ దాస్ తెలిపా రు. గత 2 సంవత్సరాలుగా అకుల్ దోమకొండ గడికోట లో కోచ్ ప్రతాప్‌దాస్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటు న్నాడు. జాతీయస్థాయికి అకుల్ ఎంపిక అవ్వడం పట్ల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభి నందించారు. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రథమ ప్రతిభ కనబరిచి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

- ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న కారణంగా నెల చివరి నాటికి 18 గ్రామాలలో ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించి కొలతల ప్రకారం డబ్బులు చెల్లించాలని సూచించారు. నీటి సమస్యను పరిష్కరిస్తూ, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని విధంగా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు.

ముర్రు జాతి గెదలతో.. అధిక పాలదిగుబడులు

- పశు వైద్యాధికారి సంతోష్

నవతెలంగాణ-పిట్లం

ముర్ర జాతి గేదలను సంరక్షణ చర్యలు చేపట్టినట్లయితే అధిక పాల దిగుబడినిస్తాయని పశు వైద్యాధికారి సంతోష్ అన్నారు. సోమవారం మండలంలోని గౌరారం గ్రామంలో పశు గణన అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో దూడల ప్రదర్శన , పాల ఉత్పత్తి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకరజాతి గేదెల కన్న ముర్రు జాతి గేదెలు ఆరోగ్యకరమైన, బలిష్టమైన దూడలనిస్తూ అధిక పాల దిగుబడి ఇస్తాయని తెలిపారు. అందుకుగాను పాడి రైతులు, వ్యవసాయదారులు ముర్రు జాతి గేదెల పట్ల మక్కువ పెంచుకోవాలని, వాటిని సంరక్షణ చర్యలు చేపట్టినట్లయితే అధిక పాల దిగుబడులతో పాడి రైతుల కుటుంబాలు అభివద్ధి బాటలో నిలుస్తాయని ఆయన కోనియాడారు. కాగా దూడల ప్రదర్శన , పాల ఉత్పత్తి పోటీలలో గెలుపొందిన పాడి రైతులకు ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులను అందజేశారు. అనంతరం పోటీలకు పాల్గొనిన దూడలకు నట్టల నివారణ మందు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ తిరుపతి, గోపాలమిత్ర సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన రైతులకు బహుమతులు అందజేస్తున్న పశువైద్యాధికారి

విద్యుత్ వినియోగదారులకు వినూత్న సేవలను అందిస్తున్నాం

- కామారెడ్డి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎన్.శ్రవణ్ కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యుత్ వినియోగదారులందరికి మరింత చేరువై వారికి వినూత్న సేవలు అందిస్తున్నామని ఇందులో భాగంగా విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం చేపట్టామని కామారెడ్డి సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఎన్.శ్రవణ్ కుమార్ తెలిపారు. సోమవారమిక్కడ 'విద్యుత్ ప్రజావాణి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ఫిర్యాదులను తీసుకొని వాటిని సకాలంలో పరిష్కరించేందుకు ప్రతి సోమవారం " విద్యుత్ ప్రజావాణి" నిర్వహించనున్నట్లు తెలిపారు. 2024 జూన్ 17 న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కరించడానికి అన్ని సర్కిల్ , డివిజన్ , సెక్షన్ ఆఫీస్ లలో అమలు చేస్తున్నామని తెలిపారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలు ప్రధానంగా విద్యుత్ బిల్లుల సమస్యలు , మీటర్ల సమస్యలు , విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు, క్యాటగిరి మార్పు , పేరు మార్పు ప్రమాద భరితంగా ఉన్న స్థంబాలు తదితర విద్యుత్ ఫిర్యాదుల సమస్య తీవ్రతను బట్టి అప్పటికప్పుడే లేదా సమయం తీసుకొని పరిష్కరించడానికి దోహద పడుతుందని తెలిపారు. వినియోగదారులతో సత్ సంబంధాలు మరింత మెరుగుపడుతాయని అన్నారు. ఇప్పటి వరకు విద్యుత్ ప్రజావాణి లో 444 ఫిర్యాదులు రాగా, 400 పరిష్కరించామని తెలిపారు . ఇట్టి కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కొరకు సర్కిల్ పరిధిలోని అన్ని ముఖ్య కార్యాలయాల్లో అనగా సర్కిల్ ఆఫీస్, డివిజన్ ఆఫీస్ , ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్ లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌లలో "ప్రతి సోమవారం "ఉదయం 10 గంటల నుండి ఒంటి గంట వరకు, సర్కిల్ ఆఫీస్ లో అదే రోజు సమయం మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. విద్యుత్ ప్రజా వాణి కార్యక్రమన్ని పటిష్ట పరిచడంలో భాగంగా సమీక్షలు నిర్వహించి విద్యుత్ వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. "విద్యుత్ ప్రజావాణి" వినియోగదారులకు మరింత చేరువలో అయ్యి వారితో మమేకమై ఉద్యోగస్తులు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కార వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని వివరించారు.


మాట్లాడుతున్న శ్రావన్‌కుమార్

పొద్దుతిరుగుడుకు మంది దిగుబడి



నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండలంలోని గ్రామాలలో ఈసారి పొద్దు తిరుగుడు పంటను ఏడు ఎకరాల్లో పండిస్తున్నారు. 6 నుంచి 7 క్వింటల్ వరకు దిగుబడి ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పొద్దుతిరుగుడు పంట భారీగా పండించిన రైతులు, నాటి నుండి కొత్త పంటలైన సోయా, శనగ, ఇతర వాణిజ్య పంటలను పండించడం మొదలుపెట్టారు. మరోసారి పంట మార్పిడిలో భాగంగా పొద్దుతిరుగుడు పంట సాగుపై ఆసక్తి కనబరిచడంతో సాగువిస్తీర్ణం పెరిగింది. కాగా పంట దిగుబడి బానే వచ్చే అవకాశాలున్నట్టు రైతులు పేర్కొంటున్నారు.

విత్తన బంతులు తయారుచేసిన విద్యార్థులు



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు తమ్మల రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు విత్తన బంతులను తయారు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, నేషనల్ గ్రీన్ కార్ప్స్ కార్యక్రమంలో భాగంగా 20 రకాల విత్తనాలను సేకరించి 1000 విత్తన బంతులు తయారు చేశారు. ఈ బంతులను ఎండబెట్టి నిల్వ ఉంచి జూన్ మూడో వారంలో అడవిలో అటవీశాఖ చూపించిన ప్రదేశంలో బంతులను విసిరి వేయనున్నట్టు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్ మాట్లాడుతూ. విద్యార్థుల్లో పర్యావరణ వ్యవస్థ, అడవుల్ని పరిరక్షించడంపై విద్యార్థి దశ నుంచి అలవాటు చేయడం ద్వారా జీవవైవిధ్యాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, సుజాత, శ్రీమతి, ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహంలో ఆరోగ్య శిబిరం


విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసున్న వైద్యులు

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

రాజంపేట్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జంగం పల్లి గ్రామం శివారులో ఉన్న కేజీబీవి బాలికల వసతి గహంలో సోమవారం ఆరోగ్య శిబిరం నిర్వహించినట్టు రాజంపేట వైద్యాధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. 45 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మంజూర్, ఏఎన్ఎం శ్రీలత, హాస్టల్ స్టాఫ్ నర్స్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

నేడు రాజంపేట్ పట్టణ కేంద్రంలోని రైతుకు వేదిక కార్యాలయంలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పశుసంపద-పశుజాతుల అభివద్ధిపై ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహించినట్టు మండల వ్యవసాయ అధికారి శశి ఒక ప్రకటనలో తెలిపారు. మండల రైతులు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సూచించారు. సమస్యలు పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఎన్‌సిడి స్క్రీనింగ్ పరీక్షలలో వైద్య సిబ్బంది


టెస్టులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికేబుల్ డిసీసెస్ (ఎన్‌సిడి) వైద్య పరీక్షలను మెడికల్ అధికారి దివ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నిర్వహించారు. 30 సంవత్సరాలు పైబడిన వారందరికి బీపి, షుగర్, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వ్యాధులను గుర్తించడానికి 40 రోజుల్లో 100శాతం వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. 30 సంవత్సరాలు పైబడిన వారు తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ వెంకటరమణ, స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పిఈటి కృష్ణంరాజుకు సన్మానం


విద్యార్థిని, పిఈటిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

37వ జూనియర్ నేషనల్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2024-2025 హర్యానాలో జరిగిన గేమ్స్‌లో తెలంగాణ తరపున ఆడిన బగ్గలి మహిమను, పీఈటీ కృష్ణంరాజును సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెను మెమోంటో, శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు బోదాస్ సాయిరాం, ఉపాధ్యక్షులు పల్లపు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ముద్దంగుల మహేష్, కోశాధికారి దండ్ల నాగరాజు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తపై అవగాహన


చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అదికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కమిషనర్ ఆదేశానుసారం సోమవారం పట్టణంలోని 26వ వార్డులో చెత్తను తడి పొడి చెత్త, హానికర చెత్తగా వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డ్ ఆఫీసర్ నితీన్, మెప్మా ఆర్పీ సమత, వార్డు మహిళలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- భవిష్యత్ తరాలు సెక్స్‌వృత్తిలోకి రానీవ్వొద్దు
- పలువురు వక్తల పిలుపు
- అంతర్జాతీయ సెక్స్‌వర్కర్ల హక్కుల దినోత్సవం



నవతెలంగాణ-కంఠేశ్వర్

సెక్స్‌వర్కర్లు కారణాలేవైనా ఈ వృత్తిని ఎంచుకుని కుటుంబ పోషణ చేసుకుంటున్నారని, కానీ భవిష్యత్ తరాలు సెక్స్ వృత్తిలోకి రావొద్దని.. అది అందరి బాధ్యత అని పలువురు వక్తల పిలుపునిచ్చారు. కుటుంబ పోషణతో పాటు తమ ఆరోగ్య రీత్యా, కుటుంబ పోషణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య, ఉపాధి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడీలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో అంతర్జాతీయ సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గణపురం వెంకటేశ్వర్లు, ఏపీఎం సుధాకర్, స్నేహ సొసైటీ కార్యదర్శి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఏ ఇతర కారణాలతోనైనా ఈ వృత్తిలోకి వచ్చారని.. ఈ వృత్తి ద్వారా కుటుంబ బాధ్యత పోషణ చేస్తున్నప్పటికీ మీ ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలని సూచించారు. ఎయిడ్స్ బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ప్రత్యేకంగా ఎయిడ్స్ పరీక్షల అంబులెన్స్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే ఈ అంబులెన్స్ ద్వారా పరీక్షలతో పాటు లైంగిక సమస్యలు కౌన్సెలింగ్, అలాగే ఇతర సమస్యలు ఓ ప్రణాళికాబద్ధంగా పరీక్షించడం జరుగుతుందన్నారు. ఈ వృత్తిపై ఆధారపడి బతుకుతున్న వారి ఆరోగ్యాల దృష్ట్యా కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు జీవనోపాధి కోసం ఆర్థిక సహాయం లక్షల్లో ఇస్తుందని తెలిపారు. భవిష్యత్ తరాల వారు ఈ వృత్తిలోకి రాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని వివరించారు. చిన్న మధ్య తరహా వ్యాపారాలు నడిపి ంచుకునేందుకు కూడా ప్రత్యేక పథకం ద్వారా 50 వేల రూపాయల నుంచి 5 లక్షల వరకు కూడా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తుందన్నారు.. సమాజంలో అందరితోపాటు మీకూ సమానమైన హక్కులున్నాయని మీ హక్కులను హరించే హక్కు లేదని ఇటీవలే సుప్రీంకోర్టు సైతం తెలియపరిచిందని తెలిపారు. ముఖ్యంగా క్రమశిక్షణ, మానసిక ధైర్యం, చిన్న చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందేందుకు కృషి చేయాలని సూచించారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈ పథకం ద్వారా నిజామాబాద్ ఆదిలాబాద్ జిల్లాల నోడల్ అధికారి రాజేష్ యాదవ్ మాట్లాడుతూ.. 5 లక్షల వరకు మైక్రో బిజినెస్ పథకం ద్వారా అందించనున్నట్లు వివరించారు. అలాగే ముద్ర పథకం ద్వారా 50000 వరకు 10 లక్షల వరకు స్టేట్ ఆఫ్ ఇండియా ఉమెన్ కోటి రూపాయల వరకు, మ్యానుఫ్యాక్చరింగ్ పథకం కింద 50 లక్షల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ఇండస్ట్రీ విభాగం అనేది ఉంటుందని ఆ విభాగం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సహాయం పొందవచ్చునని తెలియజేశారు. అలాగే ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి సుధాకర్, నిజామాబాద్ ఆదిలాబాద్ క్లస్టర్ ప్రివెన్షన్ అధికారి మోయిజ్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ 95 గురించి తెలియజేశారు. ఈ మిషన్ 95 అనేది హెచ్ఐవి ఉందా లేదా అనేది పరీక్షలు చేయడం, అలాగే ఉన్నవారు ఎప్పటికప్పుడు మెడిసిన్ తీసుకోవడం, జాగ్రత్తలు పాటించడం, మరొకరికి సోకకుండా భవిష్యత్ తరాలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు జీఎస్ఎం బాలరాజ్, జీఎస్ఎం మౌనిక, కౌన్సిలర్ అన్విత, అకౌంట్స్ అధికారి విజయ్ కుమార్, పారా లీగల్ వాలంటరీ వెంకట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన ప్రారంభించాలి

- ఎంపీడీఓ సంతోష్ కుమార్


మాట్లాడుతున్న ఎంపీడీవో సంతోష్ కుమార్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన ప్రారంభించాలని ఎంపిడిఓ సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎంపిక చేసిన 85 మంది అర్హులైన లబ్ధిదారులతో గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఇంటి నిర్మాణంపై అవగాహన కల్పిస్తూ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం చేసుకోవాలని బేస్‌మెట్ పూర్తి చేసుకుంటే మొదటి రూ.లక్ష అందజేస్తామని, ఇంటి నిర్మాణ స్టేజ్‌ను బట్టి డబ్బులు విడుదల అవుతాయని వివరించారు. వీలైనంత తక్కువ డబ్బుతో మంచి నాణ్యతగా నిర్మించుకుంటే త్వరగా పూర్తి చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్, డీఈఈ హౌసింగ్ ప్రభు, ఏఈ సత్యనారాయణ, పీస్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న గృహనిర్మాణ ప్రాజెక్ట్ డైరెక్టర్

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని సీతాయిపేట్ గ్రామంలో ప్రభుత్వం పేదలకు అందించనున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు 113 మంది కుటుంబాలకు అధికారులు అవగాహనా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గృహనిర్మాణ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభు పాల్గొని లబ్దిదారుల కుటుంబాలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న గృహనిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలని, వాటి నియమ నిబంధనలను తెలియజేశారు. అనంతరం అధికారులు లబ్దిదారుల నిర్మాణ స్థలాల్లో కొందరి నూతన ఇంటి నిర్మాణాలకు ముగ్గును పోశారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ సహాయక అధికారి సత్యనారాయణ, ఎంపిడిఓ బాలకృష్ణ, ఎంపిఓ రాజేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ మాజీ సర్పంచ్ లోక్కిడి విజయ రాములు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలకు ట్యాబ్‌లు పంపిణీ


పాఠశాలకు ట్యాబ్‌లు అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

పీఎంశ్రీ పథకం ద్వారా డిజిటల్ పాఠాల బోధన కోసం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 25 ట్యాబ్‌లు మంజూరైనట్లు మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. మంజూరైన ట్యాబ్‌లను సోమవారం ఎంఈఓ పాఠశాలకు పంపిణీ చేశారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా పాఠాల గురించి సందేహాలను నివృత్తి చేయనున్నామని ఎంఈఓ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో భాగంగా పీఎం శ్రీ పథకం ద్వారా డిజిటల్ పాఠాల బోధన కోసం ప్రభుత్వ పాఠశాలకు ట్యాబ్‌లు అందించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభ కనబరిచిన వివేకానంద విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

నవతెలంగాణ-మెండోర

విశ్వం ఎడ్యుటెక్ హైదరాబాద్ వారు నిర్వహించిన నేషనల్ లెవెల్ స్పెల్ బి కార్నివల్‌లో వెల్గటూర్ శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థిని మండాజీ ప్రవస్థి తన ప్రతిభను కనబరిచి ఉత్తమ విద్యార్థిగా ఎంపికైనట్టు పాఠశాల కరస్పాండెంట్ మండాజి రాజ్‌కుమార్ తెలియజేశారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందానికి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

నిర్మాణానికి నిధులు రాక.. అమ్మకానికి

- మధ్యలోనే నిలిచిపోయిన మేరు సంఘం భవన నిర్మాణ పనులు
- రూ.8.50లక్షలు మేరు కులస్తులపై అప్పు



నవతెలంగాణ-వర్ని(చందూర్)

చందూర్ మండల కేంద్రంలో మేరు కుల సంఘానికి సంబంధించిన కుల భవనాన్ని అమ్మనున్నట్టు పలు వాట్సాప్ గ్రూపులలో వైరల్ అవుతోంది. మేరు కుల సంఘం సభ్యుల వివరాల ప్రకారం.. 2022 సంవత్సరంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేరు కుల సంఘం భవనం నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామని హామీనిచ్చింది. అందులో భాగంగా ప్రభుత్వం భవనాన్ని నిర్మించడానికి టెండర్ వేసింది. బెస్మెట్ పనుల వరకు రూ.లక్షా 50 వేలు మాత్రమే మంజూరు అయ్యాయి. అంతలో ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ పడటంతో మేరు కుల సంఘం భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే వరకు బయట వ్యక్తుల నుంచి కుల సభ్యులు అప్పుగా రూ.5 లక్షలు తెచ్చారు. ఆ డబ్బులతో మరి కొంత పిల్లర్ల పనులు చేపట్టారు. అప్పటి నుంచి తెచ్చిన అప్పుకు వడ్డీ పెరుగుతూ రావటంతో అప్పు కట్టలేక, ప్రభుత్వం నిధులు రాలేక కుల సంఘం సభ్యులు విసిగిపోయారు.

అమ్మేద్దామని..

భవనం నిర్మాణానికి తెచ్చిన రూ.5 లక్షలకు నెలకు రూ.12 వేలు వడ్డీ అవుతోంది. నాలుగు సంవత్సరాల నుంచి వడ్డీ కట్టలేక సంఘం భవనాన్ని అమ్మివేద్దామనే నిర్ణయానికి వచ్చారు. అందులో భాగంగా పలువురిని ఫోన్ ద్వారా సంప్రదిస్తున్నారు. వాట్సాప్ గ్రూపులలో మేరు కుల సంఘ భవనం అమ్మబడునని షేర్ చేసినట్లు మేరు కుల సంఘం సభ్యులు తెలిపారు.

వంట పాత్రలను శుభ్రంగా ఉంచాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ముందు వంట పాత్రలను శుభ్రంగా కడగాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని హాసకొత్తూర్ గ్రామ పరిధిలోని మారుతీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను ఆయన తనిఖీ చేశారు. శుభ్రమైన వాతావరణంలో కలుషితం కాకుండా మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేయాలని నిర్వహకులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రతిరోజు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థు లతో కలిసి ఎంపీడీవో మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపా ధ్యాయులకు పలు సలహాలు, సూచనలు చేశారు. తరగతి గదు లను సందర్శించి ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్ గురించి అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి సంవత్సరం జైలు

- ఐదువేల జరిమానా

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో మండల కేంద్రానికి చెందిన తుదిగేన దేవేందర్ అలియాస్ జానీకి ఒక సంవత్సరం జైలుశిక్ష, ఐదువేల రూపాయలు జరిమానా విధిస్తూ ఆర్మూర్ ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ నేల్లి సరళ రాణి తీర్పు వెలువరించినట్లు కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు నిందితునికి శిక్షను ఖరారు చేస్తూ మేజిస్ట్రేట్ సోమవారం తీర్పును వెల్లడించినట్లు తెలిపారు. తన చేయి పట్టుకుని లాగి, చున్నీ పట్టుకొని అసభ్యకరంగా ప్రవర్తించాడని 2019లో బాధితురాలు కేసు పెట్టగా అప్పటి కమ్మర్‌పల్లి ఎస్ఐగా ఉన్న ఆసిఫ్ కేసు నమోదు చేసి, విచారణ అనంతరం కోర్టులో పోలీసులు అభియోగ పత్రం దాఖలు చేశారని ఎస్ఐ వివరించారు. ఈ కేసులో పూర్వ పరాలను పరిశీలించిన మేజిస్ట్రేట్ నేల్లి సరళ రాణి నిందితుడు దేవేందర్‌కు ఒక సంవత్సరం జైలు శిక్ష, 5వేల జరిమానా విధిస్తూ తీర్పుని వెలువరించారన్నారు. నిందితుడికి శిక్ష పడే విధంగా కోర్టులో కేసును అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.రామకృష్ణ వాదించారని తెలిపారు. కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు కానిస్టేబుల్ రాజును ఎస్ఐ జి.అనిల్‌రెడ్డి అభినందించారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

యువత విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నగరంలోని బండ్లగూడ ప్రాంతంలో ఓ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. యువత క్రీడల్లో జాతీయస్థాయికి, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు.

రైతులకు సమగ్ర సస్యరక్షణ కిట్లు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో రైతు క్షేత్ర పాఠశాలలో భాగంగా రైతులకు సమగ్ర సస్య రక్షణ కిట్లు (ఐపిఎం) సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటోరెడ్డి పర్యవేక్షణలో గత ఆరువారాల నుంచి క్షేత్రస్థాయిలో వరి పంట వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చేవరకూ పాటించవలసిన అన్నీ సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హెూన్నప్పగౌడ్ మాట్లాడుతూ.. పురుగుమందులు వాడేటప్పుడు పాటించవలసిన జాగ్రత్తలపై చాలా విషయాలను వివరించారు. రైతులకు పురుగు గుడ్లపై వేప నూనె పిచికారీ, రెక్కల పురుగుపై నిఘా పెట్టటానికి లింగాకర్షక బుట్టలు, ట్రైకోగ్రామా గుడ్డు పరాన్న జీవి ఉపయోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయాధికారి కె.దేవిక, వ్యవసాయ విస్తరణ అధికారి శివప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి శుభాకాంక్షలు తెలిపిన కేవీపీఎస్ నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహబూబ్ నగర్‌లో జరుగుతున్న రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండగంగాధర్ నూతనంగా ఎన్నికైన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి సోమవారం శుభాకాంక్షలు తెలియజేశారు.

తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

సీఎం పిటిషన్‌పై తప్పుడు నివేదిక ఇచ్చిన మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు ఆరోపించారు. సోమవారం పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షులు మందుల బాలు మాట్లాడుతూ.. మున్సిపల్ అక్రమాలపై సీఎంఓకు ఫిర్యాదు చేశామని, సిఎంఓ నుంచి అడిషనల్ కలెక్టర్ అంకిత్‌కు విచారణ చేయాలని ఆదేశాలు వస్తే అక్రమ ఇంటి నంబర్‌లు రద్దు చేశామని నివేదికలో పొందుపరిచారని.. కానీ ఇప్పటివరకు ఆ ఇంటి నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కొన్ని వ్యాపార సముదాయాలు కాంప్లెక్స్ ఇప్పటికీ అవి కిరాయికి ఇచ్చి అక్రమ కబ్జాదారులు దర్జాగా ఉన్నారని ఎలాంటి నోటీసులు కానీ వాటిపై ఎలాంటి చర్యలు కానీ తీసుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు నూతల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జస్సు అనిల్, మాజీ పట్టణ అధ్యక్షులు ద్యాగ ఉదయ్, మాజీ కౌన్సిలర్ ఆకుల శ్రీను, మాజీ సర్వసమాజ అధ్యక్షులు ఆకుల రాజు, పాన్ శీను, ఆరే రాజేశ్వర్, గుగులోత్ తిరుపతి నాయక్, ఖాందేశ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ శుభ్రం

- 'మురికి కాలువల్లో చెత్త' వార్తకు స్పందన



నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని నడిమిగల్లిలోని మురికి కాలువలలో చెత్త పేరుకు పోయి దుర్వాసన రావడంతో దోమల బెడద ఎక్కువైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నవతెలంగాణ దినపత్రికలో ఆదివారం "మురికి కాల్వలో చెత్త" అనే వార్త ప్రచురితమైంది. దీనికి గ్రామపంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి స్పందించి పారిశు ద్ధ్య సిబ్బందితో మురికి కాలువల్లోని మురుగును, చెత్తను తొలగించారు.

స్వాములకు స్టీల్ ప్లేట్లు, గ్లాసుల అందజేత



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో అంజన్న మాలధారణలో భాగంగా మండల దీక్షలు తీసుకున్న స్వాములకు బిక్ష(భోజనం) చేసేందుకు గ్రామానికి చెందిన ధాత్రిక రాజు సొంత ఖర్చుతో స్టీల్ ప్లేట్లు, గ్లాసులు సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు స్థానిక జంబి హనుమాన్ దేవాలయంలో అంజన్న స్వామి మండల దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వాములు మాల ధారణలో భాగంగా ప్రతిరోజు బిక్ష కొరకు ప్లాస్టిక్ ప్లేట్లు నిషేధిస్తూ స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు వాడాలని నిర్ణయించారు. దీంతో ధాత్రిక రాజు అంజన్న స్వామి మాల ధారణ స్వాములకు సొంత ఖర్చులతో 80 స్టీల్ ప్లేట్లు, 80స్టీల్ గ్లాసులు కొనుగోలు అందజేశారు. ఈ సందర్భంగా ధాత్రిక రాజుకు జంబి ఆ హనుమాన్ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అంజన్న మాల ధారణ స్వాములు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
మంగళవారం | మార్చి 04, 2025 | www.navatelangana.com


సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు


పూజలు నిర్వహిస్తున్న సునీల్‌కుమార్ దంపతులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దుల గుట్టపై బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పట్టణంలోని ప్రఖ్యాతిగాంచిన శ్రీ నవనాథ సిద్దుల గుట్టపై సిద్ధేశ్వరుడుని కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గుట్టపై గల శ్రీ సీతారాములను, ఆంజనేయస్వామిని, అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టెపు రెడ్డి సంఘం నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూ ర్ ఎల్లారెడ్డి గ్రామంలో సోమవారం చిట్టెపు రెడ్డి సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులు దుబ్బాక నర్సారెడ్డి ఉపాధ్యక్షులు మోసర్ల మైపాల్ కోశాధికారి గంపల శ్రీనివాస్ రెడ్డి, దొంతి మహేష్, కార్యదర్శిగా వాదుల ప్రవీణ్‌రెడ్డి, సలహాదారులుగా గంపల సత్యనా రాయణ, గంగసాని, సాగర్‌రెడ్డి, మోసర్ల రా జిరెడ్డి, మసిరెడ్డి, శివారెడ్డి, కొండి కొండల్ రెడ్డి, దుబ్బాక మహిపాల్ రెడ్డి, వాదుల బాల్ రెడ్డి చీకోటి బాల్ రెడ్డి, ,మాసిరెడ్డి గోపాల్ రెడ్డి, దొంతి తిరుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

యూత్ అధ్యక్షునిగా ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నిక



నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ పట్టణ శాలివాహన కుమ్మరి సంగం యూత్ నూతన కార్యవర్గం సోమవారం ఎన్నుకున్నారు. లింగంపేట్ పట్టణ శాలివాహన కుమ్మరి సంఘం సభ్యులు మండల కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. లింగంపేట్ పట్టణ కుమ్మరి శాలివాహన యూత్ సంఘం అధ్యక్షులుగా కుమ్మరి ప్రభాకర్, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు నరేష్, కార్యదర్శి వేణు, కోశాధికారి రవీందర్, లను యూత్ సభ్యులు కార్యవర్గ సభ్యులు సలహాదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ శాలివాహనులు కుమ్మరి వారు ఆర్థికంగా రాజకీయంగా విద్య పరంగా అన్ని రంగాలలో ముందు ఉండాలన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఇంటర్ నోడల్ అధికారికి బీసీ విద్యార్థి సంఘం, టీజేఎస్ వినతి


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేలా అధికారులు కృషి చేయాలని బీసీ విద్యార్థి సంఘం, టీజేఎస్ ఆధ్వర్యంలో నోడల్ అధికారి షేక్ సలాంకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని,విద్యార్థిని విద్యార్థులకు తగిన మౌళిక వసతులు కల్పించాలని అన్నారు. పరీక్ష కేంద్రంలో వేసవి కాలం దృష్ట్యా మంచి నీళ్ల సౌకర్యం కల్పించి అదే విధంగా ప్రతీ తరగతి గదిలో ఫ్యాన్స్ ఉండే విధంగా చూడాలన్నారు.

21 కిలోమీటర్ల హాఫ్ పోటీల్లో ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థి ప్రతిభ



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థి అర్జున్ ఆదివారం కామారెడ్డిలో క్యాన్సర్ సేవల కోసం నిర్వహించిన 21 కిలోమీటర్ల హాఫ్ పోటీలలో పాల్గొని పథకంతో పాటు 21,000 రూపాయల నగదు గెలుచుకున్నాడు. అర్జున్‌ను పాఠశాల ప్రిన్సిపల్ అభినందించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



ఉపాధి పనుల పరిశీలన

నవతెలంగాణ-భిక్కనూర్

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఇసాన్నపల్లి, లక్ష్మీ దేవునిపల్లి ఆయా గ్రామాలలో ఉపాధి పనుల వివరాలు పంచాయతీ కార్యదర్శుల చేత అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో కూలీల సంఖ్య పెంచి అర్హత ఉన్నవారికి ఉపాధి కూలీ కల్పించాలన్నారు. గ్రామాలలో పారిశుద్ధ పనులు నిర్వహించి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని కార్యదర్శులకు సూచించారు.

ఐలాపూర్ ఎస్సీ హాస్టల్‌కు నిధులు మంజూరు


మాట్లాడుతున్న మంద మహిపాల్

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఎస్సి హాస్టల్‌కు రూ.2కోట్ల 45లక్షలు నిధులు మంజూరైనట్టు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణరావు, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు, ఏఎంసి డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఐలాపూర్ మాజీ సొసైటీ చైర్మన్ మీసాల లక్ష్మి నారాయణ, ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, డీసీసీ డెలిగేట్ దేవిదాస్ గౌడ్, చింరాజ్‌పల్లి మాజీ సర్పంచ్ తోట గణేష్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు యూసఫ్, ఐలాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజు, మండల కిసాన్ కేత్ అధ్యక్షులు దమ్మాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు


తలపడుతున్న మల్లయోధులు


విజేతకు బహుమతి పంపిణీ

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని గోర్గల్ గ్రామంలో బేడీల మైసమ్మ బోనాల సందర్భంగా సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా బేడీల మైసమ్మ బోనాల పండుగ సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కుస్తీ పోటీలకు మల్ల యోధులు అంతరాష్ట్రమైన మహారాష్ట్ర, కర్ణాటక నుండి మల్ల యోధులు వచ్చి పోటీపడతారని తెలిపారు. కుస్తీలు తలబడుతుంటే చూపరులను ఆకట్టుకున్నాయి. విజేతలకు మాజీ ఎంపీపీ పట్లోల్ల జ్యోతి దుర్గారెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాగి మాజీ సర్పంచ్ అంజయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో కారు ఢీకొని గుత్పవాసి మృతి

- గ్రామంలో విషాధచాయలు



నవతెలంగాణ-మాక్లూర్

నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం గుత్ప గ్రామానికి చెందిన చలిగంటి మోహన్ అనే వ్యక్తి గల్ఫ్‌లో కారు ఢీకొని మృతిచెందాడు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో వ్యాపారం తగ్గడంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయిన మోహన్.. అప్పులు పెరగడంతో గత ఐదు నెలల క్రితం దుబాయ్ వెళ్లి డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 23న కారు ప్రమాదంలో మరణించాడు. అయితే మృతదేహం సోమవారం స్వగ్రామానికి చేరుకోగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీటి పర్యాంత మయ్యారు. మోహన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబం ఆర్థికంగా దిక్కు తోచని స్థితిలో ఉందని మోహన్ కుటుం బాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు గుమ్ముల నరేంద్ర డిమాండ్ చేశారు.

విద్యాశాఖ అధికారికి సన్మానం


ఎంఈఓను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శివలింగప్పను కుర్నాపల్లి స్థానిక తాజా మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో కుర్నాపల్లి గ్రామ పెద్దలు ఆయనను సన్మానించి సత్కరించారు. మండలంలోని కుర్నాపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న శివలింగ్ గాలప్పను మండల విద్యాశాఖ అధికారిగా సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన సైతం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను సన్మానించిన వారిలో కుర్నాపల్లి తాజా మాజీ సర్పంచ్ దుబ్బాక సావిత్రి రవీంద్రగౌడ్, ఎడపల్లి సహకార సంఘం డైరెక్టర్ పరిగె సుమాన్, కృష్ణ ముదిరాజ్, మండల పరిషత్ తాజా మాజీ కోఆప్షన్ సభ్యులు మోబిన్, అల్తాఫ్, గ్రామపెద్దలు, తదితరులున్నారు.

కరాటేలో పతకాలు సాధించిన హయగ్రీవ పాఠశాల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నవతెలంగాణ-ఏర్గట్ల

మంచిర్యాలలో నిర్వహించిన 3వ జాతీయ ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలకేంద్రానికి చెందిన హయగ్రీవ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అలివేణి మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన వెంకటేష్ అనే విద్యార్థి కరాటే పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడని, ఇద్దరు విద్యార్థులు వెండి, మరో ఇద్దరు విద్యార్థులు రజత పతకాలు సాధించినట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అభ్యాస విద్యార్థికి సిల్వర్ మెడల్



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జాతీయస్థాయిలో 37వ జూనియర్ నేషనల్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో నిజామాబాద్ జిల్లాకు చెందిన అభ్యాస స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సంహిత హరియాణాలో పాల్గొని సిల్వర్ మెడల్‌ను సాధించింది. విద్యార్థినిని అభ్యాస స్కూల్ కారస్పాండెంట్ అన్నపూర్ణ, ప్రిన్సిపాల్ మాధవి, పిఈటి ఆకుల నాగరాజు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

నవతెలంగాణ-పోతంగల్(కోటగిరి)

కోటగిరి మండలంలోని యద్గాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎత్తొండ మాజీ ఎంపీటీసీ ఫారుక్, యూత్ సెక్రెటరీ సాయినాథ్, అనిల్ టాక్లీ, పార్టీ గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌గా ప్రసన్న హంసిక నియామకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి


కుమారి గుమ్మన్నగారి ప్రసన్న హంసికకు కారుణ్య నియామకంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియామక ఉత్తర్వులను వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్.టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి సోమవారం అందజేశారు. తెలంగాణ యూనివర్సిటీలో తెలుగు విభాగంలో గతంలో సుదీర్ఘ కాలం పనిచేసిన కీర్తిశేషులు ప్రొఫెసర్ జి.బాల శ్రీనివాస్ మూర్తి అకాల మరణం చెందారు. తెలంగాణ ప్రభుత్వ కారుణ్య నియామక జీవో. ఎం.ఎస్.నెంబర్ 400 ప్రకారం తన కూతురు జి.ప్రసన్న హంసికను జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తర్వులు అందించిన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌కు తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) అధ్యక్షులు డాక్టర్.ఏ.పున్నయ్య, ఉపాధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణరెడ్డి, కోశాధికారి డాక్టర్ అడిగే నాగరాజ్, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

5న బయోటెక్నాలజీ విభాగంలో ప్రదర్శన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 5న జరిగే జాతీయ సైన్స్ డే సందర్భంగా జీవ సాంకేతిక శాస్త్ర ప్రయోగాల ప్రదర్శన సదస్సు బ్రోచర్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి, కన్వీనర్ డాక్టర్ ప్రసన్న శీల, కోకన్వీనర్ డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ మహేందర్ ఐలేనితో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు కన్వీనర్, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న శీల మాట్లాడుతూ.. ఈ ప్రయోగాల ప్రదర్శన సదస్సుకు తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు హాజరవుతారన్నారు. ఈ ప్రదర్శనలో జీవ సాంకేతిక శాస్త్ర ప్రయోగ పద్ధతులు ఉపయోగించే పరికరాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

అడిషనల్ కంట్రోలర్‌గా సంపత్ నియామకం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో అడిషనల్ కంట్రోలర్ (కాన్ఫిడెన్షియల్)గా డా. టీ.సంపత్‌ను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు నియామక ఉత్తర్వులు అందించారు. డాక్టర్ టీ.సంపత్ దశాబ్ద కాలంగా ఎకనామిక్స్ డిపార్టుమెంట్‌లో సేవలు అందిస్తున్నారు. సంపత్ గతంలో అప్లైడ్ ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ హెడ్‌గా, బిఓఎస్ చైర్మన్, వార్డెన్‌గా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్‌గా, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్, ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ చైర్మన్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా డా.టీ.సంపత్ మాట్లాడుతూ.. నా మీద నమ్మకంతో నియామకపు ఉత్తర్వులు అందించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

భార్య వదిలి వెళ్లడంతో భర్త ఆత్మహత్య

నవతెలంగాణ-రెంజల్

భార్య వదిలి వెళ్లడంతో మనస్థాపానికి గురైన భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జంగం నవీన్ (36) భార్య గత నాలుగు సంవత్సరాల కిందట వదిలి వెళ్ళిపోయింది. తీవ్ర మనస్థాపంతో నవీన్ తాగుడుకు బానిస అయ్యాడు. సోమవారం ఓ రైతు పొలం పనులకు వెళ్లి సమీపంలోనున్న మరో రైతు పొలం గట్టున జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అక్క జంగం శోభ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని 1వ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 1గంటలకు ప్రభుత్వ ఆసుపత్రి పార్కింగ్ ఏరియా వద్ద గుర్తు తెలియని వ్యక్తి వయస్సు సుమారు (40 నుంచి 45 సంవత్సరాలు) ఉంటుంది. నలుపు, తెలుపు గల టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నందున, అక్కడే ఉన్న వ్యక్తుల చికిత్స నిమిత్తం గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు మృతి చెందినట్టుగా డాక్టర్లు నిర్ధారించారు. ఇతనికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ 8712659714 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్యాన్సర్ బాధితురాలికి ఓ పాజిటివ్ రక్తం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా ముత్యంపేట్ గ్రామానికి చెందిన మంగళపల్లి విజయ (51) క్యాన్సర్ వ్యాధితో హైదరాబాద్ లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు ను సంప్రదించడంతో వెంటనే స్పందించి మురికి వంశీకృష్ణ సహకారంతో ఓ పాజిటివ్ రక్తాన్ని అందజేశారు.

ఉత్తమ సృజనాత్మక ప్రదర్శన

నవతెలంగాణ-నిజాంసాగర్

అద్భుతమైన సృజనాత్మకతను కనబరిచినందుకు స్టేట్ లెవెల్ రోబోటిక్స్ ఇన్ అకాడమీకి ప్రోగ్రాం తరపున మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ట్రోఫీని అందుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్ లోని మినీ శిల్పారామంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ లో 9 జిల్లాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచినట్టు తెలిపారు. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు "రైల్వే ఆక్సిడెంట్ నిర్మూలన" ఇన్నోవేషన్ ఛాలెంజ్ ను ఇండిపెండెట్లీ అద్భుతమైన సృజనాత్మకతను కనబరిచినట్టు వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారికి గైడ్ టీచరుగా వ్యవహరించిన చందనను పాఠశాల ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయ బృందం అభినందించారు.



ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో సోమవారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు మాత్రమే పనిచేయాలని కూలీలకు సూచించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం, ప్రతిరోజు 300 రూపాయల కూలిపడే విధంగా పనిచేయాలని చెప్పారు. అనంతరం మల్లూర్ తాండ గ్రామపంచాయతీని పరిశీలించి మిషన్ భగీరథ త్రాగునీటి సమస్యను ఆయన పరిష్కరించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అనిత, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, ఏపీవో శివకుమార్, గ్రామపంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.